నమస్తే తెలంగాణ


కరీంనగర్

5 | కరీంనగర్, బుధవారం 25 డిసెంబర్ 2024 | KARIMNAGAR


## మెర్రీ క్రిస్మస్

క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. కరీంనగర్‌లోని లూర్దుమాత, వెస్లీ సెంటినరీ, సీఎస్ఐ వెస్లీ కేథడ్రల్ చర్చిలతోపాటు ఉమ్మడి జిల్లాలోని చర్చిలన్నీ విద్యుద్దీపాలతో వెలిగిపోతున్నాయి. బుధవారం వేడుకలు అంబరాన్నంటనుండగా, మంగళవారం అర్ధరాత్రి తర్వాతి నుంచే ప్రత్యేక ప్రార్థనలు మొదలయ్యాయి.

- కమాన్ చౌరస్తా, డిసెంబర్ 24



ముస్తాబైన క్రిస్టియన్ కాలనీలోని చర్చి



# అంగట్లో ఆపరేటర్ పోస్టులు?

ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ సబ్‌స్టేషన్లలో రిటైర్డ్ ఆపరేటర్ల నియామకానికి సంస్థ ఇచ్చిన వెసులుబాటును పలువురు నాయకులు ఆదాయవనరుగా మార్చుకుంటున్నట్టు తెలుస్తున్నది. నిబంధనల మేరకు వ్యవహరిస్తూ అక్రమాలకు అడ్డుకట్ట వేయాల్సిన యంత్రాంగం చోద్యం చూస్తున్నట్టు విమర్శలు వ్యక్తమవుతుండడం ఆ శాఖలో చర్చనీయాంశమవుతున్నది.

- యూనియన్ ముసుగులో కొందరు నాయకుల బేరసారాలు!
- చందా ఇస్తే కోరిన చోట పోస్టింగ్ ఇప్పిస్తామని ప్రలోభాలు
- నిబంధనలకు విరుద్ధమని తెలిసినా చోద్యం చూస్తున్న అధికారులు

ముకరంపుర, డిసెంబర్ 24 : క్షేత్ర స్థాయిలో వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించడంలో ఆపరేటర్లే కీలకం. అయితే ప్రతి 33/11కేవీ సబ్ స్టేషన్లలో నలుగురు ఆపరేటర్లు ఉండాలి. కానీ, పలు సబ్ స్టేషన్లలో ఇద్దరు ముగ్గురితో నెట్టుకొస్తున్నారు. మరికొన్ని చోట్ల ఇద్దరే ఉన్నారు. దీంతో ఉన్న సిబ్బందిపై పనిభారం పడి విధులు సక్రమంగా నిర్వర్తించలేక పోతున్నారు. కొరత కారణంగా కొన్ని చోట్ల అనారోగ్యం ఉన్నా రోజుకు 12 గంటలకు పైగా విధులు నిర్వహించాల్సిన దయనీయ స్థితి ఉన్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఎక్కడ చిన్న పొరపాటు జరిగినా ఆ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో ప్రతి విద్యుత్ సబ్ స్టేషన్‌లో నలుగురు ఆపరేటర్లు కచ్చితంగా ఉండాలని ఉత్తర విద్యుత్ పంపిణీ సంస్థ నిర్ణయించింది. అయితే సంస్థలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగులను గౌరవ వేతనంతో నియమించుకుంటే కొంత వెసులుబాటు ఉంటుందని ఉన్నతాధికారులు భావించారు. ఆ మేరకు సంస్థ సీఎండీ నియామకాలకు వెసులు బాటు కల్పిస్తూ ఆదేశాలిచ్చారు. ఈ అవకాశాన్ని కొన్ని విద్యుత్ సంఘాలు ఆసరాగా తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. కొందరు నాయకులు తమ పలుకుబడి, అధికారులతో తమకున్న సన్నిహిత సంబంధాలతో ఆపరేటర్ పోస్టులను ఆదాయ వనరుగా మార్చుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంస్థలో పనిచేసి రిటైర్డ్ అయి ఆపరేటర్‌గా పనిచేసేందుకు ఆసక్తి ఉన్న వారిని గుర్తించి.. ప్రలోభ పెడుతున్నట్టు తెలుస్తున్నది. 'యూనియన్ కోసం కొంత మొత్తాన్ని చందా రూపంలో ఇస్తే.. మీరు కోరుకున్న చోట పోస్టింగ్ ఇప్పిస్తాం' అంటూ బేరసారాలు చేస్తూ.. అడ్డగోలుగా వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ క్రమంలో కరీంనగర్ రూరల్ సబ్ డివిజన్ పరిధిలోని ఓ సబ్‌స్టేషన్‌లో ఇద్దరు ఆపరేటర్లు మాత్రమే విధులు నిర్వర్తిస్తుండగా అందులో ఒకరు అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇక్కడ మరొక ఆపరేటర్ అవసరం కాగా, సంస్థలో రిటైర్డ్ అయిన ఓ ఉద్యోగి పనిచేయడానికి ముందుకు వచ్చారు. ఇంత వరకు బాగానే ఉన్నా ఇక్కడే అసలు కథ మొదలైంది. రంగంలోకి దిగిన ఓ యూనియన్ ప్రతినిధులు.. రిటైర్డ్ ఉద్యోగికి కోరుకున్న చోట ఆపరేటర్ పోస్టు ఇప్పిస్తామంటూ తమ దారికి తెచ్చుకున్నారు. అతను ముందుగా దరఖాస్తు చేసుకున్న సబ్‌స్టేషన్ కాకుండా మెయిన్ రోడ్డుకు అందుబాటులో ఉండే సబ్‌స్టేషన్‌లో పోస్టింగ్ ఇప్పించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్టు తెలుస్తున్నది. నిబంధనలకు మేరకు నడుచుకోవాల్సిన అధికారులు యూనియన్ నాయకుల ఒత్తిడికి తలొగ్గారనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ విషయంలో మరో యూనియన్ నాయకులు జోక్యం చేసుకోవడం, ఇద్దరు ఆపరేటర్లు ఉన్న చోటే రిటైర్డ్ ఉద్యోగిని నియమించాలని, దీనివల్ల అనారోగ్యంతో బాధపడుతున్న రెగ్యులర్ ఆపరేటర్‌కు కొంత ఉపశమనం కలుగుతుందని ఉన్నతాధికారులకు నివేదించినట్లు సమాచారం. దీంతో ప్రస్తుతానికి రిటైర్డ్ ఆపరేటర్ నియామకం విషయంలో అధికారులు ఏ నిర్ణయం తీసుకోకుండా స్తబ్దుగా ఉన్నట్లు తెలుస్తున్నది. ఇప్పుడీ విషయం సంస్థలో చర్చనీయాంశంగా మారింది.

## పరిహారం కోసమా..

# ప్రచారం కోసమా..?

- ముంపు గ్రామాల్లో కొత్త దరఖాస్తుల సేకరణపై అనేక అనుమానాలు
- గతంలో 12 గ్రామాల నుంచి 4,073 అర్జీలు
- వాటిని రద్దు చేస్తారా..? కొనసాగిస్తారా..? అనే ప్రశ్నలు
- ఎటువంటి స్పష్టత ఇవ్వని అధికారులు
- యథేచ్ఛగా కొత్త దరఖాస్తుల పేరిట దందా నడుపుతున్న నాయకులు?
- నాడు పరిహారం చెల్లింపుల్లో కోట్లు కొల్లగొట్టిన దళారులు?
- ప్రస్తుతం అవే పరిస్థితులు.. మళ్లీ మోసపోయే ముప్పు
- ముంపువాసుల్లో అయోమయం



కొదురుపాక గ్రామపంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ ఇండ్లు, 18 ఏళ్లు నిండిన యువతీ యువకులకు పట్టా, పరిహార ప్యాకేజీ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు (ఫైల్)

మధ్యమానేరు ముంపు గ్రామాల్లో కొత్త దరఖాస్తుల సేకరణపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వచ్చిన అర్జీలను ఏమి చేస్తారన్న దానిపై స్పష్టత ఇవ్వకుండానే.. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరిట ముద్రించిన ఫారాల ద్వారా దరఖాస్తులు సేకరించడం ఏమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. నిజానికి దరఖాస్తుల సేకరణకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు లేవని ఉన్నతాధికారులు స్పష్టం చేస్తున్నారు. అందుకే ఈ వ్యవహారంలో తాము పాలు పంచుకోవడం లేదని చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రస్తుతం హడావుడిగా పట్టా, పరిహారం కోసమంటూ.. కొత్త దరఖాస్తులను ఎందుకు సేకరిస్తున్నారు? ఇది పరిహారం కోసమా..? లేక వారి ప్రచారం కోసమా..? లేక స్థానిక సంస్థల్లో లబ్ధిపొందేందుకా..? అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. ఇదే అదనుగా సందట్లో సడేమియాలా దళారులు రంగప్రవేశం చేస్తున్నారు. నిజానికి 2011 నుంచి 2014 మధ్య ముంపు గ్రామాల పరిహారం చెల్లింపులో.. అప్పట్లో చాలా మంది దళారులు రాజ్యమేలి, అధికారులతో మాట్లాడి అంచనాలు పెంచుతున్నట్టు చెప్పి కోట్లు కొల్లగొట్టారు. ఆశల ఊసులో పడిన బాధితులు.. అడిగినన్నీ డబ్బులు ఇచ్చి ఆనాడు మోసపోయారు. ఇప్పుడు కూడా అలాంటి పరిస్థితులే కనిపిస్తుండగా, దరఖాస్తుల ప్రక్రియపై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ గానీ, అధికారులు గానీ స్పష్టత ఇవ్వకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

కరీంనగర్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మధ్యమానేరు (శ్రీరాజరాజేశ్వర జలాశయం) ముంపు గ్రామాల్లో ఇప్పుడు దరఖాస్తుల జాతర నడుస్తున్నది. 2014 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారికి పట్టా, ప్యాకేజీ ఇప్పిస్తామంటూ కొత్తగా అర్జీల సేకరణ జరుగుతున్నది. ఈ విషయాన్ని 'నమస్తే తెలంగాణ' ఇప్పటికే వరుస కథనాలతో బయట పెట్టడం తెలిసిందే. అంతేకాదు, బోయినపల్లి మండలం కొదురుపాక పంచాయతీలో కూర్చొని కొంత మంది కాంగ్రెస్ నాయకులు నేరుగా దరఖాస్తులు తీసుకోవడం బయటకు వచ్చిన విషయం విదితమే. అయితే దీనిని లోతుగా పరిశీలిస్తే.. ప్రతి గ్రామంలోనూ ఇదే తరహాలో అర్జీలు తీసుకుంటున్నట్టు తెలుస్తున్నది. నిజానికి ప్రభుత్వం నుంచి పథకాలు, ప్యాకేజీలు అందాలంటే నేరుగా దరఖాస్తు చేసుకోవాలి. ప్రజావాణిలో లేదా సంబంధిత అధికారులకు నేరుగా అర్జీ పెట్టుకోవాలి. కానీ, ఇవేవి లేకుండానే ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేరిట ముద్రించిన ఫారంలో తమ వివరాలు నింపి.. సదరు దరఖాస్తులను నేరుగా కాంగ్రెస్ నాయకులకే అప్పగిస్తున్నారు. వాస్తవానికి పునరావాస ప్యాకేజీ కొంతమందికి అందలేదన్న ఫిర్యాదులు గత ప్రభుత్వంలో రాగా.. ఆనాటి కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు 12 గ్రామాల్లో సభలు నిర్వహించి, ముంపు వాసుల నుంచి దరఖాస్తులు తీసుకున్నారు. అప్పుడు మొత్తం 4,073 అర్జీలు రాగా, అందులో అర్హులను నిర్ధారించే ప్రక్రియను చేపట్టారు. అనర్హులుగా గుర్తించిన వారికి ప్రస్తుతం నేరుగా రెవెన్యూ శాఖ నుంచి లేఖలు పంపిస్తున్నారు. ఇది ముంపు గ్రామాల్లో గందరగోళానికి దారితీసినట్టు తెలుస్తున్నది. తమకు ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని భావించిన అధికార పార్టీ నాయకులు.. అధికారుల నుంచి లేఖలు పంపించకుండా ఆపినట్లు తెలుస్తున్నది. దాని నుంచి బయటపడేందుకు కొత్తగా దరఖాస్తుల స్వీకరణ చేపట్టారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### మళ్లీ మోసపోయే ప్రమాదం?

ఇంత బహిరంగంగా దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో అధికారుల మౌనం ముంపువాసులకు తీవ్ర నష్టాలను తెచ్చిపెట్టడమే కాదు, మరోసారి మోసపోయే ప్రమాదాన్ని తీసుకురానున్నది. నిజానికి 2011 నుంచి 2014 మధ్య.. మధ్యమానేరులో ముంపునకు గురైన ఇళ్లు, భూములకు పరిహారం చెల్లింపులు జరిగాయి. ఆనాడు ఇళ్లకు అంచనాలు పెంచి అధిక డబ్బులు వచ్చేలా చేస్తామని చాలా మంది దళారులు మాయమాటలు చెప్పి కోట్లు దండుకున్నారు. అప్పట్లో చాలా గ్రామాల నుంచి దళారుల వ్యవస్థ నడువగా, అప్పుడు పనిచేసిన కొంత మంది అధికారులు కూడా వీరితో కుమ్మక్కయ్యారు. అయితే ముందుగా వేసిన అంచనాల ప్రకారం సకాలంలో ప్రభుత్వం డబ్బులు చెల్లించని పక్షంలో ఏటా నిబంధనల ప్రకారం కొంత అమౌంట్ పెరుగుతుంది. దానిని చూపి దళారులు లక్షలు కాజేశారు. ఈ దళారుల దందాలో చాలా మంది మోసపోయారు. అప్పటి మోసాల నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉన్నది. ఇప్పుడు కొత్త దరఖాస్తులు స్వీకరిస్తుండగా కొంతమంది దళారులు.. మళ్లీ ముంపు వాసుల్లో ఆశలు రేకెత్తించి, దోచుకునే అవకాశాలు అధికంగా ఉన్నాయి. ఈ పరిస్థితి రాకుండా ఉండాలంటే ప్రతి విషయంపై స్పష్టత ఇవ్వాలన్న డిమాండ్ వస్తున్నది. నిజంగానే అర్హులైన వారికి పట్టా, ప్యాకేజీ ఇప్పించే ఉద్దేశం ఉంటే ఆ విషయాన్ని స్పష్టంగా ప్రజలకు వివరించాల్సిన అవసరమున్నది. ఆ క్లారిటీ ఇవ్వకుండా దరఖాస్తులు తీసుకోవడం వల్ల ముంపుగ్రామాల ప్రజలు మరోసారి దళారుల చేతిలో మోసపోయే అవకాశాలుంటాయన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

### అనేక ప్రశ్నలు.. స్పష్టత ఎక్కడ?

దరఖాస్తుల వ్యవహారంలో వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, అలాగే జిల్లా అధికారుల నుంచి స్పష్టత రావాల్సిన అవసరమున్నది. నిజానికి తన పేరిట దరఖాస్తు ఫారాలు ముద్రించిన విషయం ఎమ్మెల్యేకు తెలుసా.. లేదా..? అన్నది తెలియాల్సి ఉన్నది. సాధారణంగా ఏ ఎమ్మెల్యే అయినా తన వద్దకు వచ్చిన దరఖాస్తులు తీసుకోవడం ఒక ఆనవాయితీ. అలా వచ్చిన తర్వాత పరిష్కారం కోసం సిఫారసు లేఖలు పెడుతూ ప్రభుత్వానికి, అధికారయంత్రాగానికి పంపిస్తారు. ఆ సమస్యను పరిష్కరించాలని కోరుతారు. ఇప్పటివరకు ప్రతి ఎమ్మెల్యే వద్ద జరుగుతున్న ప్రక్రియ ఇదే. కానీ, ఏకంగా ముద్రించిన దరఖాస్తు ఫారాలు పంపించి, ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా నాయకులే స్వీకరించడం ఎంత వరకు కరెక్ట్ అనే ప్రశ్న వస్తున్నది. ఒక వేళ ఎమ్మెల్యే పార్టీ నాయకులకు ఆదేశాలు ఇచ్చి ఉంటే.. ఆ విషయంలోనైనా స్పష్టత ఇవ్వాల్సిన అవసరమున్నది. ప్రధానంగా కొత్త దరఖాస్తులు స్వీకరిస్తున్న నేపథ్యంలో అనేక ప్రశ్నలు తెరపైకి వస్తుండగా, ముఖ్యంగా గతంలో 12 గ్రామాల నుంచి స్వీకరించిన 4,073 దరఖాస్తుల్లో ఎంత మంది అర్హులో.. ఎంత మంది అనర్హులో చెప్పాలన్న డిమాండ్ వస్తున్నది. ఈ దరఖాస్తులుండగానే.. కొంత మంది నాయకులు బహిరంగంగా కొత్త అర్జీలు సేకరిస్తున్నట్టు వెలుగులోకి రావడం అయోమయానికి గురి చేస్తున్నది. ఈ నేపథ్యంలో కొత్తగా దరఖాస్తులు ఇవ్వాలా..? వద్దా..? అన్న దానిపై అధికారయంత్రాగం క్లారిటీ ఇవ్వాల్సి ఉన్నది. కానీ, ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. అలాగే అర్జీల స్వీకరణకు ప్రభుత్వం నుంచి ఏమైనా ఆదేశాలు వచ్చాయా.. లేదా..? రాకపోతే బహిరంగంగా ప్రజల నుంచి ఏకంగా పంచాయతీ కార్యాలయంలోనే దరఖాస్తులు స్వీకరిస్తుంటే అధికారులు ఎందుకు మౌనం పాటిస్తున్నట్టు? అధికార పార్టీ నుంచి ఒత్తిళ్లు ఉన్నాయా..? లేక తమకెందుకులే అనుకుంటున్నారా..? ఇది దేనికి సంకేతం? పాత దరఖాస్తులను రద్దు చేస్తారా..? లేక వాటినే పరిగణలోకి తీసుకుంటారా..? ఇలా అనేక ప్రశ్నలు ముంపువాసుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పష్ట ఇవ్వాల్సిన అవసరముందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**గతంలో అధికారులు గ్రామాల వారీగా నిర్వహించిన సమావేశాల్లో వచ్చిన దరఖాస్తుల వివరాలు**

| ముంపు గ్రామాలు | వచ్చిన దరఖాస్తులు |
|---|---|
| కొడిముంజ | 366 |
| రుద్రవరం | 713 |
| అనుపురం | 611 |
| శభాష్‌పల్లి | 202 |
| సంకెపల్లి | 242 |
| అరెపల్లి | 118 |
| చింతల్‌ఠాణా | 601 |
| చీర్లవంచ | 363 |
| గుర్రం వానిపల్లె | 45 |
| కొదురుపాక | 440 |
| నీలోజుపల్లె | 312 |
| వరదవెల్లి | 60 |
| మొత్తం | 4,073 |



మల్లాపూర్‌లో జిమ్ చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల

## రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్

- కాంగ్రెస్‌కు అల్లు అర్జున్ మీద ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదు
- ఏడాది పాలనలో ప్రభుత్వం పూర్తిగా విఫలం
- కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల ధ్వజం

మల్లాపూర్, డిసెంబర్ 24: ఏడాది పాలనలోనే కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని, రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయే తప్ప ఏ రంగం పైనా శ్రద్ధ చూపడం లేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్‌కు సినీ హీరో అల్లు అర్జున్ మీద ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమంపై లేదని మండిపడ్డారు. మల్లాపూర్‌లో ఎంపీ (రాజ్యసభ సభ్యుడు) నిధులు ₹5 లక్షలతో నిర్మించిన ఓపెన్ జిమ్, జడ్పీ నిధులు ₹1.50 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లను మంగళవారం ఆయన ప్రారంభించారు. 33 మంది లబ్ధిదారులకు ₹9,74,000 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. రైతు భరోసా రాక, రుణమాఫీ రాక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఇక్కడ మాజీ జడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ బద్దం అంజిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తోట శ్రీనివాస్, పట్టణాధ్యక్షుడు బండి లింగస్వామి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ కాటిపల్లి ఆదిరెడ్డి, నాయకులు దేవ మల్లయ్య, గౌరు నాగేశ్, ముద్దం శరత్‌గౌడ్, కొమ్ముల జీవన్‌రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, అల్లూరి ఆదిరెడ్డి, మేకల సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

## పారకం

# ప్రశ్నార్థకమేనా..?

- నిర్వహణ లేక అధ్వానంగా ఎస్సారెస్పీ కాలువలు
- అనేక చోట్ల దెబ్బతిన్న కాలువల లైనింగ్
- కూరుకుపోయిన పూడిక.. అడ్డంగా బండరాళ్లు
- పట్టించుకోని సర్కారు
- నేటి నుంచి ఎగువ ఆయకట్టుకు నీళ్లు
- చివరి ఆయకట్టుకు చేరడం గగనమే
- నీరు నిలిచిన సమయంలో పనులకు ప్రతిపాదనలు
- సాధ్యమయ్యే పనేనా..? అని ప్రశ్నిస్తున్న రైతులు

ఎస్సారెస్పీ ఎగువ ఆయకట్టుకు నేటి నుంచి నీటిని విడుదల చేసేందుకు అంతా సిద్ధమైంది. కానీ, ప్రభుత్వం కాలువల మరమ్మతులు మరిచిపోయింది. కాలువల లైనింగ్ దెబ్బతిని, అనేక చోట్ల బుంగలు పడ్డాయి. పూడిక కూరుకుపోయి, పిచ్చిమొక్కలు పెరిగి పూర్తిగా అధ్వానంగా మారాయి. ఈ పరిస్థితుల్లో చివరి ఆయకట్టుకు నీటిని ఎలా సరఫరా చేస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. కాలువలు బాగు చేయకుండా నీరందించడం గగనమేనని తెలుస్తుండగా, ప్రణాళిక లేని ప్రభుత్వంపై రైతాంగం మండిపడుతున్నది. ఆన్, ఆఫ్ పద్ధతిలో నీరిస్తామని, ఆఫ్ పద్ధతి అమలులో ఉన్నప్పుడు మరమ్మతులు చేస్తామని అధికారులు చెబుతుండగా.. ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్నది.



కరీంనగర్ మండలం ఎలబోతారం వద్ద దెబ్బతిన్న డీ-89 ప్రధాన కాలువ

కరీంనగర్, డిసెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ఎగువ ప్రాంతానికి నేటి నుంచి నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. ప్రాజెక్టు ఎగువ ప్రాంతంలోని 4.62 లక్షల ఎకరాలకు నీళ్లించేందుకు ప్రాజెక్టు అధికారులు నీటి ప్రణాళిక ఖరారు చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 80.5 టీఎంసీలు అందుబాటులో ఉండగా, అందులో 5 టీఎంసీలు దిగువ ఆయకట్టుకు, 62 టీఎంసీలు ఎగువ ఆయకట్టుకు ఇవ్వాలని నిర్ణయించారు. అయితే ఉమ్మడి జిల్లా పరిధిలోని జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో ఉన్న 3.80 లక్షల ఎకరాలకు బుధవారం నుంచి ఆన్ ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేస్తారు. కరీంనగర్ జిల్లా విషయానికి వస్తే డీ-87 నుంచి డీ- 94 వరకు ఉన్న డిస్ట్రిబ్యూటరీల ద్వారా నీటిని రిలీజ్ చేయనున్నారు. అయితే కాలువల పరిస్థితి చూస్తే మాత్రం మరోలా ఉన్నది. చాలా చోట్ల శిథిలావస్థకు చేరాయి. డ్రాప్టులు కూలి పోయాయి. పూడిక కూరుకుపోయి, చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి, గండ్లు పడి పూర్తిగా అధ్వానంగా మారిపోయాయి. కాలువలకు ఎలాంటి మరమ్మతులు చేయకుండానే నీటిని విడుదల చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది.

### ఈ కాలువలు మరీ అధ్వానం

కరీంనగర్ జిల్లా పరిధిలోని డీ-89, డీ-94 కాలువల పరిస్థితి పూర్తిగా అధ్వానంగా మారింది. కరీంనగర్ రూరల్ మండల పరిధిలోని కాలువల్లో ఎక్కడ చూసినా పగిలిన డ్రాప్టులు, తెగిన లైనింగ్ కనిపిస్తున్నాయి. నీరు పారకుండా పెద్ద పెద్ద బండరాళ్లు అడ్డంగా ఉన్నాయి. కరీంనగర్ మండలంలోని ఇరుకుల్ల, మొగ్దుంపూర్, ఎలబోతారం గ్రామాల పరిధిలో చూస్తే ఈ కాలువల నుంచి నీళ్లు ఎలా పారుతాయనే సందేహాలు తప్పక వ్యక్తమవుతాయి. డీ-89 కాలువ పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలంలోని సాంబయ్యపల్లి, గొల్లపల్లి వరకు వెళ్తుంది. ఈ గ్రామాల్లో సైతం ప్రధాన కాలువ పరిస్థితి అధ్వానంగా ఉన్నది. కాలువలకు పడిన గండ్లు పూడ్చకపోతే కరీంనగర్, సుల్తానాబాద్ మండలాల్లోని చివరి ఆయకట్టుకు నీళ్లు వచ్చే పరిస్థితి లేదు. డీ-89 ప్రధాన కాలువ పరిధిలోని ఉప కాలువల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. ఇక డీ-94 ప్రధాన కాలువ ద్వారా కరీంనగర్ మండలంలోని గోపాల్‌పూర్, దుర్శేడ్, చేగుర్తి, బొమ్మకల్ గ్రామాలకు సాగునీరు అందుతున్నది. కొత్తపల్లి మండలం మల్కాపూర్ నుంచి ప్రారంభమయ్యే ఈ కాలువ రేకుర్తి, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపహాడ్ వరకు మున్సిపల్ నిధులతో పూడిక పనులు చేశారు. అక్కడి వరకు బాగానే ఉన్న కాలువ ఆ తర్వాత అధ్వాన పరిస్థితిలో ఉంది.

### నీళ్లిస్తూనే పూడిక తీస్తారట

ప్రాజెక్టు ఎగువ ప్రాంతానికి నీళ్లు ఇస్తూనే కాలువల్లో పూడిక తొలగింపు, మరమ్మతు పనులు చేపడతామని ఎస్సారెస్పీ అధికారులు చెబుతున్నారు. నీటిని ఆన్, ఆఫ్ పద్ధతిలో విడుదల చేస్తున్న నేపథ్యంలో ఆఫ్ పద్ధతి అమలులో ఉన్నప్పుడు కాలువల్లో పూడిక తొలగింపు, మరమ్మతులు చేపట్టాలని ఇటీవల పోచంపాడు ప్రాజెక్టును పరిశీలించేందుకు వచ్చిన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించినట్టు తెలుస్తున్నది. అయితే అందుకు అవసరమైన నిధులు మాత్రం విడుదల చేయనట్టు తెలిసింది. మొత్తం ఏడు తడుల్లో నీళ్లిచ్చే అవకాశం ఉండగా.. మొదటి తడి కింద ఇచ్చిన నీళ్లు ఇలాంటి అధ్వానమైన కాలువ గుండా చివరి ఆయకట్టుకు ఎలా చేరుతాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. యాసంగి పంటలకు నీళ్లిచ్చే ముందు మరమ్మతులు చేపడితే బాగుండేదని, తీరా ఇప్పుడు నీటిని విడుదల చేసిన తర్వాత ఎలా మరమ్మతులు చేస్తారని వాపోతున్నారు.





కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ శివారులో పగిలిపోయిన డ్రాప్టు, ఎలబోతారం వద్ద కాలువలో బండ రాళ్లు

### ఇదీ నీటి ప్రణాళిక

ఎస్సారెస్పీ పరిధిలోని ఎగువ ఆయకట్టుకు 62.88 టీఎంసీల నీటిని వినియోగించుకునేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చింది. ఆన్, ఆఫ్ పద్ధతిలో నీటిని విడుదల చేయనున్నారు. కాలువ దిగువ ప్రాంతంలో ఉన్న డీ-54 నుంచి డీ 94 వరకు విడుదల చేసిన ప్రతి సారి 5,500 క్యూసెక్కులు, ఎగువ ప్రాంతంలో ఉన్న డీ- 5 నుంచి డీ-53 వరకు 3,500 క్యూసెక్కుల నీటిని ఇవ్వనున్నారు. మొదటి సారి డీ- 54 నుంచి డీ-94 వరకు ఉన్న డిస్ట్రిబ్యూటరీలకు నీటిని ఇస్తున్నారు. డీ-54 నుంచి డీ-94 వరకు ఉన్న డిస్ట్రిబ్యూటరీలకు డిసెంబర్ 25 నుంచి జనవరి 2 వరకు మొదటి, జనవరి 9 నుంచి 17 వరకు రెండు, జనవరి 24 నుంచి ఫిబ్రవరి 1 వరకు మూడు, ఫిబ్రవరి 8 నుంచి 16 వరకు నాలుగు, ఫిబ్రవరి 23 నుంచి 3 వరకు ఐదు, మార్చి 10 నుంచి 18 వరకు ఆరు, మార్చి 25 నుంచి 2 ఏప్రిల్ వరకు ఏడు విడుతల్లో సాగు నీరు విడుదల చేయనున్నారు. అలాగే డీ-5 నుంచి డీ -53 వరకు.. జనవరి 2 నుంచి 9 వరకు మొదటి, జనవరి 17 నుంచి 24 వరకు రెండు, ఫిబ్రవరి 1 నుంచి 8 వరకు మూడు, ఫిబ్రవరి 16 నుంచి 23 వరకు నాలుగు, మార్చి 3 నుంచి 10 వరకు ఐదు, మార్చి 18 నుంచి 25 వరకు ఆరు, ఏప్రిల్ 2 నుంచి 9 వరకు ఏడు విడుతల్లో నీటిని రిలీజ్ చేయనున్నారు.